క్లుప్తంగా

యువత వ్యాపార రంగాల్లో రాణించాలి



శ్రీరామ ట్రేడర్స్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో

నెన్నెల: యువత వ్యాపార రంగాలను ఎంచుకొని ఆర్థికంగా ముందుకు సాగాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. మండల కేంద్రంలో కుశ్నపల్లి చౌరస్తాలో నిర్వాహకులు జంపయ్య, దూప సతీశ్ ఏర్పాటు చేసిన శ్రీరామ ట్రేడర్స్, పెయింటింగ్ షాపును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధితోపాటు మరికొందరికి ఉపాధి కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత స్వయం ఉపాధికై రుణాలు అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొమ్మెన హరీశ్‌గౌడ్, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జున్

చెన్నూర్: దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని తహసీల్దార్ మల్లికార్జున్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎంఈవో రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఐఈఆర్పీలు శ్రీనివాస్, శ్రీకాంత్, కాంప్లెక్ హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

'ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కుతున్నారు'

జన్నారం: ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి భరత్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ ఆరోపించారు. ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ఆదేశాలతో మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిన ఆయనకు నివాళులర్పించడానికి అవకాశం ఇవ్వకుండా మాజీమంత్రి హరీశ్‌రావు, ఇతర ఎమ్మెల్యేలను ఎమ్మెల్సీలను హౌజ్ అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఫజల్‌ఖాన్, నర్సాగౌడ్, ప్రభుదాస్, ఎల్లయ్య, శ్రీధర్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి స్వామివివేకానంద జయంతి మాసోత్సవాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి(తాండూర్): ఈనెల 12 నుంచి జనవరి 12 తేదీవరకు స్వామి వివేకానంద జయంతి మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తాండూర్ మండల శ్రీ స్వశక్తిభారత్ సేవా ట్రస్ట్, సేవా జ్యోతి నిర్వాహకులు తెలిపారు. సేవాజ్యోతి శరణాలయంలో మాసోత్సవాల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో నిర్వహించే మాసోత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. వ్యవస్థాపక అధ్యక్షురాలు గజ్జెల్లి శ్రీదేవి, విద్యార్థులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న ఎస్ఎస్‌కే సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట లిక్కర్ గోదాంలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంపూర్ణ సురక్షా కేంద్రం(ఎస్ఎస్‌కే) ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. హమాలీలు, ఇతర కార్మికులకు బీపీ, షుగర్, ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించారు. దిశ సీఎస్ఓ రాజేశ్, కౌన్సిలర్లు నరేందర్‌రెడ్డి, నర్మద, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, ఎస్ఎస్‌కే మేనేజర్ సతీశ్, ఓఆర్‌డీలు అన్నపూర్ణ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి: అంబేడ్కర్ చౌరస్తాగా బోర్డు ఏర్పాటు చేస్తున్న చైర్‌పర్సన్



రామకృష్ణాపూర్: బీఆర్ఎస్ కార్యాలయంలో..



మందమర్రిరూరల్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తూ..

ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి

సాక్షి నెట్‌వర్క్: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజకీయ పార్టీలు, దళిత, అంబేడ్కర్ సంఘాలు తదితర ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తా వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు ఆయన విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. 1 వార్డు కన్నాల బస్తీలో బస్తీవాసి గజ్జెల రాంనాథ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేతలు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. టీపీసీసీ సభ్యుడు సీహెచ్.శంకర్, ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు. కాగా, కాంటా చౌరస్తాకు అధికారికంగా అంబేడ్కర్ చౌరస్తాగా నామకరణం చేశారు. మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ చౌరస్తా పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు.



బెల్లంపల్లి: కన్నాల బస్తీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రవీణ్, చైర్‌పర్సన్



సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో..



నస్పూర్‌లో..



కోటపల్లిలో..



బెల్లంపల్లి(తాండూర్): నివాళులర్పిస్తున్న నేతకాని సంఘ నాయకులు



కాసిపేటలో..



లక్సెట్టిపేట: జెండా ఎగురవేస్తున్న నాయకులు



చెన్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

అంబేడ్కర్ దార్శనికుడు

- జీఎం ఎల్వీ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకొని శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, అధికారులు సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్సీ లైజన్ అధికారి కిరణ్‌కుమార్, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఎం రాజేశ్వర్, లా అధికారి ప్రభంధిత, పర్సనల్ డిపార్టుమెంట్ అధికారి దేవేందర్‌రెడ్డి, కాంతారావు, సిక్కా ఏరియా ఉపాధ్యక్షుడు కన్నం బక్కయ్య, నాయకులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జీఎం సూర్యనారాయణ, తదితరులు



జన్నారం: నివాళులర్పిస్తున్న సంఘాల నాయకులు



హాజీపూర్ మండలం టీకానపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

గ్రామాల్లో మట్టి నమూనాల సేకరణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముల్కల్ల రైతువేదిక పరిధిలోని గ్రామాల్లో భూసార పరీక్షల కోసం వ్యవసాయ క్షేత్రాల నుంచి అధికారులు శుక్రవారం మట్టి నమూనాలు సేకరించారు. 2024–25 సంవత్సరంలో పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రామాల నుంచి మట్టి నమూనాలు సేకరించి ఆదిలాబాద్‌లోని మట్టి పరీక్షా కేంద్రానికి పంపించారు. భూపోషకాలు, ఎరువుల వాడకం, మోతాదు వివరాలు తెలుస్తాయని ఈ సందర్భంగా రైతులు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏడీఏ ప్రసాద్, ఏవో కృష్ణ, ఏఈవోలు కొమురయ్య, మౌనిక, ప్రసన్న, రైతులు ఉన్నారు.



గుడిపేటలో భూసార పరీక్షకు మట్టి సేకరిస్తున్న ఏడీఏ ప్రసాద్, ఏవో కృష్ణ

సీఎం కప్ క్రీడాపోటీలు విజయవంతం చేయాలి

నస్పూర్: ఈనెల 10 నుంచి 12 తేదీ వరకు నిర్వహించే మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సతీశ్, ఎంఈవో దామోదర్ కోరారు. నస్పూర్ ఎమ్మార్సీలో పోటీల నిర్వహణపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. అథ్లెటిక్, వాలీబాల్, ఫుట్‌బాల్, ఖోఖో, యోగా తదితర పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 9 లోపు జెడ్పీహెచ్ఎస్ సీతారాంపల్లి పీఈటీ పి.జ్యోతి 7013926255, నస్పూర్ జెడ్పీహెచ్ఎస్ పీఈటీ విఠల్ 9963313653 నంబర్లలో ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నర్సింహులు, తిరుమల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సతీశ్, ఎంఈవో దామోదర్

నిజాయతీ చాటుకున్న పోస్టుమాస్టర్

చెన్నూర్: చెన్నూర్ పోస్టాఫీస్‌లో తులం బంగారం పోగొట్టుకున్న బాధితుడికి తిరిగి అప్పగించి పోస్టు మాస్టర్ నిజాయతీ చాటుకున్నాడు. మండలంలోని దుగ్నెపల్లి గ్రామానికి చెందిన ఈరబోయిన సమ్మయ్య అవసరం నిమిత్తం శుక్రవారం చెన్నూర్ పోస్టాఫీస్‌కు వచ్చి వెళ్లారు. ఈ క్రమంలో తులం బంగారం పోగొట్టుకున్నాడు. పోస్టుమాస్టర్ గుర్రం మహేశ్‌కు దొరికింది. సమ్మయ్య పోస్టాఫీసుకు వచ్చి బంగారం పోయిందని సిబ్బందిని అడిగారు. పోస్టు మాస్టర్ ఆ బంగారాన్ని బాధితుడికి అందించాడు. సిబ్బంది రాజన్న, మహేందర్, నరేశ్ పాల్గొన్నారు.



బాధితుడికి బంగారం అందజేస్తున్న పోస్టాఫీస్ సిబ్బంది

వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలి

జైపూర్: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని డిప్యూటీ రేంజర్ సతీశ్ పేర్కొన్నారు. భీమారం మండలం అంకుసాపూర్‌లో వన్యప్రాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వన్యప్రాణులు ఎదురైనప్పుడు వాటి నుంచి మనం ఎలా బయటపడాలో వివరించారు. భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో మొక్కలు కాపాడుకోవాలన్నారు. ఎఫ్ఎస్‌వో అంజిత్, ఎఫ్‌బీవో శివకుమార్, భీమేశ్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

మామిడి మార్కెట్‌యార్డులో కొనుగోళ్లకు పరిశీలన

బెల్లంపల్లి: బెల్లంపల్లి మామిడి మార్కెట్ యార్డులో వచ్చే సీజన్‌లో కొనుగోళ్లకు సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ షాబుద్దీన్ తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులు, వ్యాపారులు, మామిడి రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి కాయల కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తామని, జిల్లాలో 17,538 ఎకరాల్లో తోటలు విస్తరించి ఉన్నాయని, కొనుగోలు కేంద్రం ప్రారంభించడం వల్ల 430 మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. త్వరలో జగిత్యాలలోని మామిడి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేస్తామని తెలిపారు. సమావేశం అనంతరం మార్కెటింగ్, హార్టికల్చర్ అధికారులు మ్యాంగో మార్కెట్ షెడ్లను పరిశీలించారు. హార్టికల్చర్ అధికారి కే.అనిత, బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.భాస్కర్ పాల్గొన్నారు.



మ్యాంగో మార్కెట్ షెడ్లను పరిశీలించి వస్తున్న అధికారులు, రైతులు

ఐదు గ్యారంటీలు అమలు చేయాలి

పాతమంచిర్యాల: రాష్ట్రప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలకు విద్య, వైద్యం, భూమి, ఉపాధి, ఇల్లు ఐదు గ్యారంటీలు అమలు చేయాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. జిల్లా ప్రచార కమిటీ నాయకులు నందిపాటి రాజు, జంగపల్లి రామస్వామి, చంద్రశేఖర్, సురేందర్, తెలంగాణ బీసీ జాగృతి నాయకులు సదానందం, ఏదునూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్ష చేస్తున్న నాయకులు

జిల్లా అటవీ అధికారితో జీఎం భేటీ



శివ్ ఆశీష్‌సింగ్‌కు పూలమొక్క ఇస్తున్న జీఎం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ జిల్లా అటవీ అధికారి శివ్ ఆశీష్‌సింగ్‌తో భేటీ అయ్యారు. శుక్రవారం మంచిర్యాలలోని ఆయన కార్యాలయంలో కలిసి ఏరియాలోని ఫారెస్టు భూములపై చర్చించారు. సింగరేణి సంస్థ ఆధీనంలో ఉన్న ఫారెస్టు భూములు, వాటి అనుమతులు, ప్రాజెక్టుకు స్థలాలపై చర్చించారు. ఏరియా ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన జాగృతి నాయకులు

జైపూర్: హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను జిల్లా జాగృతి నాయకులు సిద్ధంశెట్టి సాజన్, ఐద ప్రశాంత్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో జాగృతి బలోపేతానికి కృషిచేయాలని ఎమ్మెల్సీపేర్కొన్నారని వివరించారు. ప్రజల పక్షాన ఉంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు పోరాటానికి సిద్ధం కావాలన్నారు. జిల్లాల్లో, మండలాల్లో కొత్త కమిటీలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పటిష్టంగా తయారు కావాలన్నారు.

కాంగ్రెస్ పట్టణ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ సస్పెన్షన్

పాతమంచిర్యాల: కాంగ్రెస్ పట్టణ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్ట లావణ్యను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కమిటీ సభ్యురాలు గజ్జెల హేమలత, ఆలిండియా మహిళా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నందుకు ఆమె ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి

పాతమంచిర్యాల: పార్లమెంటు సమావేశాలలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని జిల్లా కేంద్రం నుంచి లక్సెట్టిపేట వరకు సైకిల్‌యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో శాఖపూరి భీంసేన్, జిల్లా గంగపుత్ర సంఘం అధ్యక్షుడు నెన్నెల నర్సయ్య, వడ్డేపల్లి మనోహర్, గుండోజు రమేష్, అంకం సతీష్, బండ సతీష్, లక్ష్మణ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం

జన్నారం: మండలంలోని గొండుగూడ, లక్ష్మీపూర్, లోతొర్రె గ్రామాల్లో శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పరిశీలించి ఆదుకోవాలని కోరుతున్నారు.

'ఏఐటీయూసీ దాడులు మానుకోవాలి'

శ్రీరాంపూర్: అధికారంతో ఏఐటీయూసీ నాయకులు దాడులు చేయడం మానుకోవాలని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి వి.అనిల్‌రెడ్డి ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఆర్కే–1 కార్యాలయం వద్ద యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్‌పై ఏఐటీయూసీ నాయకుడు మడ్డి ఎల్లయ్య బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డాడని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఎల్లయ్యపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సన్నరకాలకు బోనస్

చెన్నూర్: రాష్ట్రప్రభుత్వం సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తోందని తహసీల్దార్ మల్లికార్జున్ ఓ ప్రకటనలో తెలిపారు. ధాన్యం నాణ్యత పరిశీలించేందుకు మైక్రో మీటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తేమ 17 శాతానికి మించి ఉండొద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి బోనస్ పొందాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ్ అభియాన్

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని అశోక్‌రోడ్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం, ఆరు నెలలు నిండిన శిశువులకు అన్నప్రాసన చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, గర్భిణులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.